సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 26 । మార్చి । 2024



వేడుకగా వెంకన్న పుష్పాంజలి

వడ్డాది వెంకన్న ఆలయంలో పవళింపు సేవ వేడుకగా జరిగింది. హుండీ లెక్కించగా సుమారు రూ.10 లక్షలు లభించింది. 8లో



వైభవంగా శోభాయాత్ర

సింహాచలం: సింహగిరిపై మంగళవారం నుంచి సుదర్శన నారసింహ మహాయజ్ఞం జరపనున్న నేపథ్యంలో శోభాయాత్ర నిర్వహించారు.

రంజాన్ వేళలు

అనకాపల్లి

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
అనకాపల్లి	6.12	4.42
నర్సీపట్నం	6.16	4.40

న్యూస్‌రీల్

కొండెక్కిన ఎన్నికల కోడ్

- పి.జగ్గంపేటలో శిలాఫలకంపై అయ్యన్నపాత్రుడి పేరు
- పట్టించుకోని అధికారులు



పి.జగ్గంపేటలో శిలాఫలకంపై కన్పిస్తున్న అయ్యన్నపాత్రుడు, ఇతర మంత్రుల పేర్లు

నాతవరం: ఎన్నికల కోడ్ అమలులో అధికారుల వైఖరిపై విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ మాజీ ప్రజాప్రతినిధుల శిలాఫలకాలను పట్టించుకోవడం లేదని, వాటిని మూయకుండా వదిలేశారని వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు సామాన్య ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు. జగ్గంపేటలో అయ్యన్నపాత్రుడు మంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన శిలాఫలకాలను మూసివేయకుండా వదిలేశారు. ఇదే గ్రామంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన శిలాఫలకాలపై పేర్లు కన్పించకుండా మూసేశారని, ఎన్నికల కోడ్ అమలులో అధికారులు వివక్ష చూపిస్తున్నారని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.


7న నూకాంబిక కొత్త అమావాస్య జాతర

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవం వచ్చే నెల 7వ తేదీన జరుగుతుందని ఆలయ ఈవో బండారు ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. జాతరను పురస్కరించుకుని దేవదాయ ధర్మాదాయశాఖ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో ఆలయ ఆవరణలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

31 వరకు ఉచిత ప్రవేశాల గడువు పెంపు

అనకాపల్లి : విద్యా హక్కు చట్టం–2009 సెక్షన్ 12(1)సి ప్రకారం 2024–25 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పెంచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ గడువు ఈ నెల 25వ తేదీ సోమవారంతో ముగిసిందని, మరింతమందికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో గడువును పెంచినట్టు ఆమె తెలిపారు. విద్యార్థులు తమ నివాసానికి సమీపంలో ఉన్న ఐబీ, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందవచ్చని, ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. జిల్లాలో మొత్తం 312 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇంకా ఆసక్తి ఉన్న వారు సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్, స్థానిక సచివాలయం, ఎంఈవో కార్యాలయం, మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో సమగ్ర శిక్ష పాఠశాల విద్య శాఖ టోల్ ఫ్రీ నంబర్ 18004258599 లో సంప్రదించాలని ఆమె సూచించారు.

నలుగుర్ని కాపాడిన లైఫ్‌గార్డ్స్



యువకులతో లైఫ్‌గార్డ్స్

బీచ్‌రోడ్డు (విశాఖ): జీవీఎంసీ పరిధి పలు బీచ్‌ల్లో మునిగిపోతున్న నలుగురు యువకులను లైఫ్‌గార్డ్స్ కాపాడారని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జోన్–4 పరిధి ఆర్కేబీచ్, జోన్–6 పరిధి అప్పికొండ బీచ్‌లో హోలీ సందర్భంగా సోమవారం బీచ్ స్నానానికి సముద్రంలో దిగి మునిగిపోతున్న వారిని లైఫ్‌గార్డ్స్ రక్షించి ప్రాణాలు కాపాడారని తెలిపారు. రైల్వే న్యూకాలనీకి చెందిన కౌశిక్, బషీర్, తుంగ్లాంకు చెందిన సన్నీకుమార్, గోల్ కుమార్‌లు కళాశాల విద్యార్థులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పాండురంగాపురం, అప్పికొండ బీచ్ సమీపాల్లో ఆటవిడుపుగా స్నానాలకు బీచ్‌లో దిగి ప్రమాదవశాత్తు మునిగిపోతున్న వారిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ హరీష్, నవీన్, అరవింద్, అచ్చన్న, కిషోర్, వెంకటేష్, తాతారావుతో పాటు పోలీస్ పెట్రోలింగ్ గణపతి తదితరులు వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారని, వీరిలో ఒకరికి సీపీఆర్ జరిపి వెంటనే 108 ద్వారా కేజీహెచ్‌కు తరలించారని, అందరూ ప్రాణాలతో బయటపడ్డారని కమిషనర్ తెలిపారు.

ఫోర్జరీ, చీటింగ్.. ఇంకా..



- ఉమ్మడి విశాఖలో కూటమిలోని ముగ్గురు ఎంపీ అభ్యర్థులపై ఆరోపణలు
- భూఆక్రమణకు పాల్పడిన విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్ ఫ్యామిలీ
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పైనా పలు కేసులు
- అరకు బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతపై బ్యాంక్ రుణాల ఎగవేత కేసు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ఎంపీ స్థానాల్లో బరిలోకి దిగుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు పలు కేసులు ఎదుర్కొంటున్నారు. భూకబ్జా, ఫోర్జరీ, రుణాల ఎగవేత వంటి కేసులు వారిని వెంటాడుతున్నాయి. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై ఫోర్జరీ కేసు, అరకు బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీతపై బ్యాంక్ రుణాల ఎగవేత కేసు, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కుటుంబంపై భూఆక్రమణ కేసులు ఉన్నాయి. వీరిపై తవ్వే కొలదీ అవినీతి, ఆక్రమణలు బయటకు వస్తున్నాయి. ఇలా పలు ఆరోపణలు ఉన్న వీరు చట్టసభలకు పోటీ చేస్తుండడంపై జనాలు విస్తుపోతున్నారు. వీరు తీరు ఇప్పుడు 'ముగ్గురూ ముగ్గురే' అన్నట్లు ఉంది.

వెంటాడుతున్న గీతం భూ ఆక్రమణల కేసు



అక్రమాల పునాదులపై విశ్వవిద్యాలయాన్ని తన కుటుంబీకులు నిర్మిస్తున్నా.. ఆపకుండా ప్రోత్సహించిన చరిత్ర విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ది. అక్రమ కట్టడాలు, భూఆక్రమణలతోనే గీతంని విస్తరించారనే ఆరోపణలు నిజమని ప్రభుత్వాధికారుల స్వాధీనంతో నిరూపితమయ్యాయి. గతంలో ఆ వివాదాస్పద వ్యవహారాలన్నీ ప్రస్తుత గీతం వర్సిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఎం.భరత్‌ని వెంటాడుతున్నాయి. గీతం కళాశాల తొలుత పాతిక ఎకరాల్లో ఏర్పాటైంది. ఆ తర్వాత క్రమక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటూ 110 ఎకరాల విస్తీర్ణంలో డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి చేరింది. ఈ సంస్థ ఆధీనంలో ఉన్న 35 ఎకరాల భూములను లీగల్‌గా కైవసం చేసుకునేందుకు అప్పటి కలెక్టర్ ద్వారా 2012 మే 28వ తేదీన ఎలినేషన్ ప్రతిపాదనలు పంపించగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాటు తొక్కిపెట్టింది. ఈ భూముల్ని దళిత విద్యార్థుల కళాశాల, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్, బలహీన వర్గాల గృహనిర్మాణం, అధికారులకు రెసిడెన్షియల్ క్వార్టర్స్, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్ ఇలా వివిధ ప్రభుత్వ అవసరాల కోసం కేటాయిస్తున్నట్లు 2014 ఫిబ్రవరి 26వ తేదీన అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేసినా.. గీతం యాజమాన్యం వాటిని వదల్లేదు. గీతం ఆక్రమించిన 40.52 ఎకరాల భూముల విలువ ఇప్పుడు రూ.500 కోట్ల పైమాటే. ఇక కేబినెట్ ఆదేశాలు, కోర్టు ఉత్తర్వులు ఎలా ఉన్నప్పటికీ ఈ భూములు 2019 వరకూ గీతం ఆధీనంలోనే ఉన్నాయి. గీతం మూర్తి చేసిన సంస్థాగత తప్పుల గురించి తెలిసినా.. తప్పు అని చెప్పకుండా.. ప్రోత్సహించిన భరత్‌ని.. ఆ పాపాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం 40 ఎకరాల వరకూ గీతం ఆక్రమిత భూముల్ని స్వాధీనం చేసుకుంది. అయినా.. తమదేం తప్పులేదంటూ భరత్ మొసలి కన్నీరు కారుస్తూ.. కబ్జా భూమిలో కొంత భాగం తన వర్సిటీలోనే ఉంచేసుకున్నారు.

రుణాల ఎగవేత నుంచి కుల అనర్హత కేసు వరకు..



2014లో వైఎస్సార్ సీపీ తరఫున అరకు ఎంపీగా గెలుపొందిన కొత్తపల్లి గీత ప్రలోభాలకు లోనై కొద్ది రోజులు టీడీపీకి దగ్గరయ్యారు. 2018లో జనజాగృతి పేరిట రాజకీయ పార్టీని నెలకొల్పారు. 2019 ఎన్నికల అనంతరం ఆ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. ఆమెపై పలు కేసు ఉన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.42.79 కోట్ల లోన్ తీసుకుని ఎగవేత కేసులోనూ దోషిగా తేలిన ఆమెకు 2022లో సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఆమె కొన్నాళ్ల పాటు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చారు. అంతేకాకుండా గీత గిరిజన మహిళ కాదని, గిరిజనులకు కేటాయించిన అరకు ఎంపీ స్థానంలో ఆమె తప్పుడు కులధ్రువీకరణ పత్రంతో పోటీ చేసి గెలుపొందిందని ఆమె ప్రత్యర్థి హైకోర్టులో కేసులు దాఖలు చేశారు. 2024 జనవరిలో గీత ఎస్టీ కాదని రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. తక్షణమే ఆమె హైకోర్టును ఆశ్రయించింది. అయితే ప్రభుత్వ గెజిట్‌ను హైకోర్టు సస్పెండ్ చేసింది.

కడప నుంచి హైదరాబాద్ వరకు అదే తీరు



సీఎం రమేష్ కడప జిల్లా పొట్లదుర్తి గ్రామంలో జన్మించారు. ఓసీ వెలమ సామాజిక వర్గానికి చెందిన ఆయన టీడీపీ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. చంద్రబాబుకు సన్నిహితంగా ఉంటూ 2012లో టీడీపీ రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. 2018లో రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా టీడీపీ నుంచి నామినేట్ అయ్యారు. 2019 జూన్ 20న బీజేపీలో చేరారు. ఈయన అక్రమాల బాగోతాలు అన్నీ ఇన్నీ కావు. 2019లో కడప జిల్లా ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కారు డ్రైవర్‌తో కలిపి తనపై దాడి చేశారని ఎర్రగుంట్లకు చెందిన పడిగపాటి వెంకట సుదక్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీనిపై ఐపీసీ 323, 324 కింద కేసులు నమోదు చేశారు. 2014–19లో గండికోట ప్రాజెక్ట్ పెండింగ్ పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఆయనపై హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదైంది. సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ స్వాతి కంపెనీ ప్రధాన కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకొని రూ.450 కోట్లు కొట్టేశారని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సినీ నటుడు వేణు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఐపీసీ సెక్షన్లు 420, 468, 471 కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఇది కోర్టులో ఉంది.

అప్పన్నకు పెళ్లికుదిరింది

- వచ్చే నెల 9న ఉగాది రోజు పెళ్లిరాట
- 19న వార్షిక కల్యాణోత్సవం



బుగ్గన చుక్కతో పెళ్లికొడుకుగా అప్పన్న



భక్తులపై రంగులు జల్లుతున్న అర్చక స్వామి

సింహాచలం: సింహాద్రి అప్పన్న స్వామికి పెళ్లి కుదిరింది. సింహగిరి నుంచి కొండ దిగువకు దిగొచ్చి తనకు పిల్లనివ్వాలని సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారిని స్వామి అర్థించాడు. ఏమిచూసి నీకు పిల్లనివ్వాలని తొలుత నిరాకరించిన పైడితల్లి అమ్మవారు.. ఆ తర్వాత స్వామికి ఉన్న వైభవాన్ని, భక్తజన సందోహాన్ని చూసి ఆశ్చర్యపోయింది. చివరకు పిల్లనివ్వడానికి అంగీకరించింది. దీంతో వచ్చే నెల 9న ఉగాది రోజు పెళ్లిరాట ఉత్సవం, 19న చైత్ర ఏకాదశిని పురస్కరించుకుని వార్షిక కల్యాణోత్సవానికి శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి సిద్ధమవుతున్నాడు.

ఘనంగా డోలోత్సవం

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తనకు పిల్లనివ్వాలంటూ సోదరి పైడితల్లి అమ్మవారిని స్వామివారు అర్థించే విధానాన్నే అడవివరం గ్రామస్తులు బొట్టినడిగే పున్నమి ఉత్సవం(డోలోత్సవం)గా అభివర్ణిస్తారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా సింహగిరిపై నుంచి పల్లకిలో మెట్ల మార్గం ద్వారా ఉదయం 7 గంటలకు తొలి పావంచా వద్దకు తీసుకొచ్చారు. స్వామిని ఊరేగింపుగా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లి హారతులు పట్టారు. తరువాత స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి ఉద్యాన వన మండపంలో ఏర్పాటు చేసిన డోలీలో అధిష్ఠింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. పూజలు చేసిన వసంతాలను అర్చకులు స్వామికి సమర్పించారు. అనంతరం డోలోత్సవం నిర్వహించి, వసంతాలను అర్చకులు భక్తులపై చల్లారు. స్వామికి పెళ్లికుదిరిన ఆనందంలో దేవస్థానం ఉద్యోగులు, భక్తులంతా ఒకరిపై ఒకరు వసంతాలను చల్లుకుని ఆనంద డోలికల్లో మునిగితేలారు. పెళ్లి కొడుకు అలంకరణలో తిరువీధిగా వచ్చిన అప్పన్న స్వామికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికి మంగళ హారతులిచ్చారు. తరువాత స్వామిని మళ్లీ పైడితల్లి ఆలయానికి తీసుకెళ్లి అక్కడి నుంచి సింహగిరికి తరలించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు తదితర్లు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజాసేవకులు.. దుర్భాషలాడితే సహించం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మంచి ఆశయంతో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ అంటే ఎందుకో చంద్రబాబు, పవన్‌లకు ఒంట్లో వణుకు పుడుతుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడారు. ఐదేళ్లుగా ప్రజల కష్టాల్లో పాలుపంచుకొని, ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రతి ఇంటికీ అందిస్తూ దేశానికే ఆంధ్రప్రదేశ్ వలంటీర్ల వ్యవస్థ ఆదర్శంగా నిలిచిందన్నారు. అలాంటి వలంటీర్లను కించపరిచే విధంగా మాట్లాడితే సహించబోమన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు ప్రతి పథకాన్ని సొమ్ము చేసుకొని, మోసాలు చేయడానికి అలవాటు పడిపోయారని, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ హయాంలో అవినీతికి తావు లేకుండా నేరుగా ఇంటికే ప్రభుత్వ పథకాలు అందిస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. వలంటీర్లను తీవ్రవాదులతో పోల్చుతూ దుర్భాషలాడటం సరికాదన్నారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బొడ్డేడ కాశీవిశ్వనాథ్, పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకురాలు లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

శారదానదిలో టెన్త్ విద్యార్థి గల్లంతు 8లో

విద్యాభివృద్ధిరస్తు

విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్య, వసతి దీవెన లబ్ధి వారికి అక్కరకు వస్తున్నాయి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, డిప్లొమా వంటి కోర్సులు అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు, అగ్ర వర్ణ పేదలకు ఎలాంటి ఆటంకం లేకుండా చదువు కొనసాగేందుకు ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తోంది. దీనికి తోడు జగనన్న వసతి దీవెన పేరుతో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రభుత్వ సహకారం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్య కల నెరవేరుతుందంటూ ఆయా వర్గాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న విద్యా దీవెన

ఏడాది	విద్యార్థులు	నగదు రూ. కోట్లలో
2019-20	38,103	77.01
2020-21	41,102	80.08
2021-22	42,155	81.12
2022-23	39,603	79.62
2023-24	39,773	26.54
మొత్తం	40,283	344.37

జగనన్న వసతి దీవెన

ఏడాది	విద్యార్థులు	నగదు రూ. కోట్లలో
2019-20	39,111	23.32
2020-21	38,812	22.08
2021-22	39,102	23.32
2022-23	36,923	21.01
మొత్తం	38,487	89.73



ఉన్నత చదువుకు భరోసా..

- జగనన్న విద్య, వసతి దీవెనతో అండ
- జిల్లాలో 40,283 వేల మంది విద్యార్థులకు మేలు
- పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ధైర్యంగా చదువులు
- నాలుగన్నరేళ్లలో రూ.434.10 కోట్లు సాయం
- పేద విద్యార్థులకు విదేశాల్లో ఉచితంగా చదువు

సాక్షి, అనకాపల్లి/రోలుగుంట, తుమ్మపాల: జగనన్న విద్య, వసతి దీవెన పథకాలు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసాగా నిలుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చదువులకు ఆటంకం లేకుండా ఏటా క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తోంది. జిల్లాలో 40,283 వేల మంది విద్యార్థులకు నాల్గున్నరేళ్ల కాలంలో రూ.434.10 కోట్లు ఆర్థిక సాయం అందించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు అర్హతే కొలమానంగా ఉన్నత చదువులకు అయ్యే పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరిస్తోంది. ప్రభుత్వ గుర్తింపు ఉన్న 275 విద్యా సంస్థల్లో డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, పోస్టు గ్రాడ్యుయేషన్ వంటి కోర్సులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చదువుకునే అవకాశం కల్పిస్తోంది.

వసతి దీవెనతో ఆర్థిక దన్ను

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కాలేజీలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. అంతేకాకుండా విద్యార్థులకు ఆర్థికంగా భరోసాగా నిలిచేలా వసతి దీవెన కూడా అందిస్తోంది. ఐటీఐ కోర్సు చేస్తున్న విద్యార్థులకు ఏడాదికి రూ.10 వేలు, పాలిటెక్నిక్, ఇతర డిప్లొమా కోర్సుల వారికి రూ.15 వేలు, డిగ్రీ ఆపై కోర్సుల చదివే విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున జగనన్న వసతి దీవెన పథకం కింద అందిస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుండటంతో విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది.

నాడు ఏ కోర్సుకైనా రూ.35 వేలు మాత్రమే..

దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా కొనసాగించారు. అయితే ఏ కోర్సు చదివినా, ఏడాదికి రూ.35 వేలు మాత్రమే ఇచ్చారు. అది కూడా సవ్యంగా ఇవ్వకపోగా, ఇచ్చే వాటిని కూడా కాలేజీలకు చెల్లించటంతో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యేవి. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు సొంతంగా ఫీజు చెల్లించాల్సిన దుస్థితి నాడు ఉండేది.

విదేశాల్లోనూ చదువులు ఫ్రీ

విదేశాల్లో చదువుకునే వారికి సైతం ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకం కింద ప్రపంచ వ్యాప్తంగా టాప్ 50 యూనివర్సిటీల్లో సీటు పొందే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకైతే రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ.కోటి వరకు మంజూరు చేస్తోంది. జిల్లాలో ఇంతవరకు ఐదుగురు విద్యార్థులు విదేశీ విద్యాదీవెన పథకం లబ్ధి పొందారు.



పథకాలు ఎంతో మేలు చేశాయి



నా పేరు తమరాన లక్ష్మి, మాది రోలుగుంట. భర్త రమణ, నేను కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. మాకు రాజశేఖర్, పావని ఇద్దరి పిల్లలు. కష్టంతో పిల్లలిద్దరినీ చదివించుకుంటున్నాం. మా అబ్బాయి రాజశేఖర్ చదువుకుంటున్న సమయంలో ప్రభుత్వ సాయం అందక పదో తరగతితో ఆపేశాడు. మాకు సాయంగా ఉంటూ 2017లో ఓపెన్ ఇంటర్ చదివాడు. చదివించే స్తోమత చాలక ఆపేశాడు. మా అమ్మాయి పావని ఇంటర్ 2019లో పూర్తి చేసింది. ఆ సంవత్సరంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. జగనన్న విద్యాదీవెన పథకం ప్రవేశపెట్టారు. 2020–21లో ఈ పథకం కింద రూ.10 వేలు, 2021–22 విద్యా సంవత్సరంలో రూ.3 వేలు, 2022–23 విద్యా సంవత్సరంలో రూ.10 వేలు వెరసి రూ.23 వేలు వచ్చాయి. ఈ నగదుతో మా అమ్మాయి బీఎస్సీ పూర్తి చేసింది. నా కుమారుడు మాదిరిగా మధ్యలో చదువు ఆగకుండా పావని డిగ్రీ పూర్తవడానికి విద్యాదీవెన ఎంతగానో ఆదుకుంది. నాకు వైఎస్సార్ చేయూత పథకం కింద రెండు సార్లు ఏడాదికి రూ.18,750 అందాయి. బయట అప్పు చేయకుండా ఈ డబ్బులు కుటుంబ పోషణకు ఉపయోగపడ్డాయి. ఇలా జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు ఎంతో మేలు చేశాయి. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

జీవితాంతం రుణపడి ఉంటాం..



నా పేరు సత్తరపు జెస్సీ మాధురి. భీమునిపట్నం. నేను బీటెక్ ద్వితీయ సంవత్సరం, నా తమ్ముడు శామ్యూల్‌రాజ్ పాలిటెక్నిక్ చదువుతున్నాం. మా నాన్న వాచ్ మెకానిక్‌గా ఉన్నారు. ఆదాయం అంతంత మాత్రమే. అది కుటుంబ పోషణకే సరిపోని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఉన్నత చదువులు కష్టం కానీ జగనన్న విద్యా దీవెనతో భరోసా దొరికింది. మా అన్నదమ్ములిద్దరికీ ఫీజుల కింద రూ 2.15 లక్ష వరకు క్రమం తప్పకుండా అందింది. ఇంటి పెద్దగా నిలిచి మా చదువులకు సహకరించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

విద్యాదీవెనతో డిప్లొమా పూర్తి చేశాను



నా పేరున గోగాడ మోహన్‌కుమార్. తుమ్మపాల మండలం గురజాడనగర్‌లో ఉంటున్నాం. బీటెక్ మొదటి ఏడాది చదువుతున్నాను. మా నాన్న ఈశ్వరరావు పెట్రోల్ బంక్‌లో పనిచేస్తారు. నాతో పాటు చెల్లి ఉంది. ఇద్దరిని చదివించలేక పదో తరగతి తరువాత ఒకరి చదువు ఆపేద్దామని నాన్న అనుకున్నారు. ఇంజినీరింగ్ చేయాలనేది నా కల. నాన్న నిర్ణయంతో అప్పుడు చాలా భయమేసింది. ఆ సమయంలో జగనన్న ప్రభుత్వం వచ్చి విద్యా దీవెన పథకం ప్రకటించింది. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ద్వారా డిప్లొమాలో చేరాను. ప్రతి సెమిస్టర్‌కు రూ.6 వేల చొప్పున ఏడాదికి రూ.25 వేల వరకు విద్యాదీవెన కింద నా బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేసింది. ఈ నగదు కళాశాలకు కట్టి మూడేళ్ల డిప్లొమా పూర్తిచేశాను. డిప్లమా మొత్తం రూ.75 వేలు అందాయి. ఈ ఏడాది బీటెక్‌లో జాయిన్ అయ్యాను. సీఎం జగన్ అందిస్తున్న విద్యాదీవెనతో ఇంజినీరింగ్ చేయాలనే నా కల నెరవేరుతుంది. చాలా సంతోషంగా ఉంది. నా చెల్లి కూడా ఈ ఏడాది డిప్లొమాలో చేరింది. పదో తరగతి వరకు చెల్లికి అమ్మఒడి కూడా పడింది. మా సొంతూరు చీడికాడ మండలం పెదగోగాడ గ్రామం. గ్రామంలో వ్యవసాయ పనులు తప్ప మరే ఆధారం లేక పదేళ్ల క్రితం నాన్న ఇక్కడికి తీసుకొచ్చేశారు. జగనన్న పథకాలతో మా చదువులు సాఫీగా సాగుతున్నాయి.

జూలో కనుమరుగైన జిరాఫీలు

- బేకన్ మృతితో ఖాళీగా ఎన్‌క్లోజర్


జూలో మృతి చెందిన జిరాఫీలు మే, బేకన్(ఫైల్)

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో జిరాఫీలు కనుమరుగయ్యాయి. దీంతో జూలో వాటిఎన్‌క్లోజరు బోసిపోయింది. 2013లో మలేషియా నుంచి విశాఖ జూకి రెండు మగ, ఒక ఆడ జిరాఫీలను సముద్ర మార్గం నుంచి ఓడలో తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే ఓ మగ జిరాఫీ ప్రాణాలు కోల్పోయింది. దీంతో మిగిలిన జత జిరాఫీలను అధికారులు విశాఖ జూకి తీసుకొచ్చారు. జిరాఫీల పునరుత్పత్తిలో భాగంగా కొన్నాళ్లకు ఆ రెండింటికి మేటింగ్ నిర్వహించారు. దాని ఫలితంగా మే అనే ఆడ జిరాఫీ ఓ మగ పిల్లకు జన్మనిచ్చింది. ఆ పిల్ల జిరాఫీ రెండు వారాల్లో మృత్యువాతపడింది. మరో మూడేళ్ల అనంతరం ఆడ జిరాఫీ మళ్లీ గర్భం దాల్చింది. ఈసారి దాని కడుపులో ఉండగానే పిల్ల మృతిచెందింది. పుట్టిన జిరాఫీ పిల్లలు నిలవలేదు సరకదా ఈసారి పెద్ద జిరాఫీలే కాలం చేశాయి. మే అనే ఆడ జిరాఫీ గత ఏడాది మే 17న అనారోగ్యంతో మృతి చెందింది. పోస్టుమార్టం రిపోర్టులో దీని పొట్టలో 16 కిలోల ఇసుక ఉన్నట్లు జూ వైద్యులు నిర్ధారించి ఆశ్చర్యపోయారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉన్న బేకన్ అనే మగ జిరాఫీ ఆదివారం అర్ధరాత్రి కార్డియక్ పల్మనరీ ఫెయిల్యూర్ కావడంతో మృతి చెందింది.


చోడవరం: అంబేరుపురంలో మహిళలను కలిసి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ధర్మశ్రీ


పాయకరావుపేట: ప్రచారంలో పాల్గొన్న పాయకరావుపేట అభ్యర్థి కంబాల జోగులు


నాతవరం: ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి విజయ సంకేతం చూపుతున్న సంక్షేమ లబ్ధిదారులు


అనకాపల్లి: కొండుపాలెంలో వృద్ధుడిని ఓటు అడుగుతున్న మలసాల భరత్‌కుమార్

ఎన్నికల శంఖారావం

- జన సందోహం మధ్య వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు సమర శంఖారావం పూరించారు. దగాకోరు కూటమి టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీలను తరిమికొట్టి సీఎం జగన్ సంక్షేమ పాలనకే జేజేలు పలకాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారాన్ని సోమవారం ప్రారంభించారు. చోడవరం మండలం అంబేరుపురంలోని పలు వీధుల్లో సాగిన ఈ ప్రచారంలో గ్రామంతోపాటు గోవాడ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ప్రచారం చేశారు. పాయకరావుపేట మండలం శ్రీరాంపురం శివారు కొత్తూరులో సాగిన ఈ ప్రచారంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు నాయకులను, ఓటర్లను పరిచయం చేశారు. నర్సీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమా శంకర్ గణేష్ నాతవరం మండలం పి.జగ్గంపేట నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆయనకు మహిళలు హారతులిస్తూ ×మళ్లీ మీరే రావాలి× అంటూ స్వాగతం పలికారు. అనకాపల్లి సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కొండుపాలెం, సీహెచ్.ఎస్.అగ్రహారం, పాపయ్యసంతపాలెంలో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి విశేష ఆదరణ లభించింది. అంతకుముందు అనకాపల్లి టౌన్ 84వ వార్డులో జనసేన పార్టీకి చెందిన 20 మంది యువకులకు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

జిల్లా వ్యాపారులసంఘం అధ్యక్షుడిగా ఈశ్వరరావు


జిల్లా వ్యాపారుల రిజిస్ట్రర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అనకాపల్లి: జిల్లా వ్యాపారుల రిజిస్ట్రర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వంకాయల ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మెయిన్ రోడ్డులోని వైఎంవీఏ హాల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా కార్యదర్శిగా ఎన్ఎస్.ప్రకాష్‌గుప్తా, కోశాధికారిగా వై.సతీష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.కృష్ణమూర్తి రాష్ట్ర కార్యదర్శి కె.కరుణ్‌కుమార్‌గుప్తా వ్యవహరించి, నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు మాట్లాడుతూ నూతన కమిటీ ఎన్నిక రెండేళ్ల పాటు ఉంటుందన్నారు. జిల్లాలో వివిధ రకాల వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

వేడుకగా పుష్పాంజలి, పవళింపు సేవ

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు
- ముగిసిన వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలు


ఆలయంలో వేంకటేశ్వరస్వామికి పవళింపు సేవ

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి పుష్పాంజలి, పవళింపు సేవ వేడుకగా జరిగింది. ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి స్వామివారికి అంకురార్పణ, ధొంగెంబెడ్లితో ప్రారంభమైన 151వ కల్యాణ మహోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలో లక్షలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చివరి రోజు రాత్రి శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో ఉంచి భక్తిగీతాలతో స్వామివారిని నిద్రపుచ్చారు. ఊయలలో దిష్టిచుక్కతో శ్రీదేవి, భూదేవి నడుమ ఇరుక్కున్న వెంకన్న అందాన్ని చూసి పలువురు భక్తులు భక్తిభావంతో ఛలోక్తులు విసిరారు. పుష్పాంజలి సేవలో భాగంగా జోలపాటలతో స్వామి వారిని పవళింపు సేవకై ఉయ్యాల ఊపడానికి పాటలు పాడటానికి పలువురు భక్తులు పోటీ పడ్డారు.

పెరిగిన హుండీ ఆదాయం

ఇక్కడ ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఐదు రోజుల ఉత్సవాల్లో హుండీ, టికెట్లు ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. ఈ ఏడాది ఉత్సవాల్లో రూ.10,04,757 వచ్చినట్లు ఈవో శర్మ తెలిపారు. గతేడాది ఉత్సవాల్లో రూ.9,92,856 ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపులో దేవస్థానం చీఫ్ ఫెస్టివెల్ ఆఫీసర్ కె. ఆదినారాయణ, వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



‘రంగు’లాట

బీచ్‌రోడ్డు: నగరంలో సోమవారం పలుచోట్ల చిన్నా, పెద్ద, యువత అంతా ఇంద్రధనుస్సు వర్ణాలలో తడిసి ముద్దయ్యారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని డీజే ధ్వనుల నడుమ సంగీతానికి లయబద్ధంగా నృత్యాలు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నగరంలో ప్రధానంగా ఆర్కే బీచ్‌తో పాటు ప్రైవేటు ఆర్గనైజర్స్ ఏర్పాటు చేసిన హోలీ ఈవెంట్‌లో పాల్గొన్నారు. రెయిన్ డ్యాన్స్‌లతో సందడి చేశారు. యువతీయువకులు రంగుల్లో తడిసిముద్దయ్యారు.








నృసింహ మహాయజ్ఞానికి నేడు అంకురార్పణ


ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యజ్ఞశాల

సింహాచలం: సింహగిరిపై సుదర్శన నారసింహ మహా యజ్ఞం నిర్వహణకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. లోక కల్యాణార్థం వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరిగే ఈ మహాయజ్ఞంను వైభవంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల స్థలంలో పెద్ద ఎత్తున యాగశాలను ఏర్పాటు చేశారు. ఐదు హోమగుండాలు, స్వామివారి ఉత్సవమూర్తులు, సుదర్శన పెరుమాళ్‌ను అధిష్టింపజేసేందుకు వేదికలు నిర్మించారు. సింహాచలం దేవస్థానం వైదికులతో పాటు ఏపీ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ రుత్వికులు సుమారు 60 మంది వరకు ఈ యజ్ఞంలో పాల్గొనను న్నారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఏదో ఒక రోజు యజ్ఞం కోసం రూ.3 వేలు టికెట్ కొనుగోలు చేసి భక్తులు పాల్గొనవచ్చు. యజ్ఞంలో భాగంగా సుభద్రా కాంప్లెక్స్ మీదుగా ఉచిత, రూ.100, రూ.300 దర్శనాల క్యూలను ఉత్తర రాజగోపురం వైపు మళ్లించారు. ఉచిత ప్రసాద వితరణ కౌంటర్‌ను కూడా త్రిపురాంతస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. యజ్ఞశాలని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు. యజ్ఞం సమాచారం కోసం భక్తులు 63038 00739, 93905 01082లలో సంప్రదించవచ్చు. www.aptemples.ap. gov.inలో వెబ్‌సైట్‌లో కూడా టికెట్లు పొందవచ్చు.

రోజుకో వాహనంపై తిరువీధి : ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రోజుకో వాహనంపై స్వామివారి తిరువీధి నిర్వహించనున్నారు. 27న శేష వాహనం, 28న సర్వజన మనోరంజని, 29న హనుమత్ వాహనం, 30న సూర్యప్రభవాహనం, 31న వెండి గరుడ వాహనంపై సింహగిరి మాడవీధుల్లో స్వామి విహరించనున్నారు. వచ్చేనెల 1న ఉదయం బంగారం పల్లకిలో తిరువీధి నిర్వహించనున్నారు.

ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంతానోత్పత్తికి చర్యలు


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: అంతరించిపోతున్న అరుదైన ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంతానోత్పత్తికి చర్యలు చేపడుతున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్‌వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలీవ్ రిడ్లే తాబేళ్లు తీర ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలల్లో వలస వచ్చి గుడ్లు పెట్టి, వాటి సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయన్నారు. మళ్లీ మే నెలలో వాటి పిల్లలతో సముద్రంలో చేరుకునే ప్రక్రియ ప్రతి సంవత్సరం విశాఖ బీచ్‌ల్లో జరుగుతుందని తెలిపారు. ఆర్కే బీచ్, సాగర్‌నగర్, చేపలుప్పాడ, పెదనాగమయ్యపాలెం బీచ్‌లలో మెకానికల్ బీచ్ క్లీనింగ్‌కు బదులు మే నెల చివరి వరకు మ్యానువల్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులతో పరిశుభ్రత చర్యలు చేపడుతూ, తాబేళ్ల సంతానోత్పత్తికి జీవీఎంసీ కృషి చేస్తుందన్నారు. సందర్శకులు కూడా వ్యర్థాలను బీచ్‌లో పడేయకుండా సమీపంలోని డస్ట్‌బిన్లలో వేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

శారదానదిలో టెన్త్ విద్యార్థి గల్లంతు


చిన యాదగిరిపాలెంలో ప్రమాదం జరిగిన ప్రదేశం


శివ కోసం గాలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) కాకర శివ(ఫైల్)

- స్నేహితులతో స్నానానికి దిగి నీళ్లపాలు
- చిన యాదగిరిపాలెంలో ఘటన
- శేషకొండ కాలనీలో విషాదం

మునగపాక/యలమంచిలి రూరల్: తెల్లారితే పదో తరగతి పరీక్ష రాయాల్సిన విద్యార్థి స్నానానికి వెళ్లి శారదానదిలో గల్లంతయ్యాడు. ఈ ఘటన మునగపాక మండలం మెలిపాక శివారు చిన యాదగిరిపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. యలమంచిలి పట్టణంలోని శేషకొండ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆర్నెల్ల క్రితం తండ్రి గంగరాజు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషాదం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ఆ కుటుంబాన్ని ఈ ఘటన మరోసారి దుఃఖ సాగరంలోకి నెట్టింది. శేషకొండ కాలనీలో నివాసముంటున్న కాకర కుమారి కూలి పని చేసుకుంటూ కుమారుడు శివ(15)ను పోషిస్తోంది. అతడు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు రాస్తున్న శివ తన కాలనీకి చెందిన కొందరు స్నేహితులతో కలిసి ఉదయం చిన యాదగిరిపాలెం వద్ద శారదానదిలో స్నానానికి వెళ్లాడు. అక్కడ నదిలోకి దిగిన శివ నీట మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మునగపాక పోలీసులు, స్థానికులతో కలిసి రాత్రి వరకూ తీవ్రంగా గాలించినప్పటికీ జాడ దొరకలేదు. దీంతో విద్యార్థి తల్లి తల్లడిల్లిపోయింది. అక్కడ నదీ ప్రాంతంలోనే ఆమె తనకు దిక్కెవరంటూ కన్నీటి పర్యంతమైంది. మంగళవారం పదో తరగతి పరీక్ష రాయాల్సిన శివ అనూహ్యంగా గల్లంతవడంతో కాలనీకి చెందిన అతని స్నేహితులు, ఇరుగు పొరుగువారు దిగ్భ్రాంతికి గురయ్యారు. అతడి క్షేమ సమాచారం కోసం దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు. శివ తల్లి కుమారి మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాలింపు చర్యలు చేపడుతున్నామని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ తెలిపారు.

ఇసుక కొండకు పోటెత్తిన భక్తులు


ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. హోళీపౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణాధికారి బుద్ధా నాగ జగదీష్ పర్యవేక్షించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేటు సమీపంలో 50–60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. రెండు వారాలుగా ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో తిరుగుతూ ఉండే అతడు మృతి చెందినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించామన్నారు. మృతుని సంబంధీకులు వివరాలకు 9491930675 సంప్రదించాలని సూచించారు.


750 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం


పులుపు, సామగ్రిని ధ్వంసం చేస్తున్న కొత్తకోట పోలీసులు

రావికమతం: మండలంలోని చీమలపాడు గ్రామ శివారు బొమ్మాలమ్మ జోన కొండపై సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 750 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు సోమవారం తెలిపారు. సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. బెల్లం పులుపుతోపాటు పెద్ద ఎత్తున సామగ్రి ధ్వంసం చేశామన్నారు.

వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు


దామునాపల్లిలో పట్టుబడ్డ మద్యం సీసాలు


గజపతినగరం జంక్షన్‌లో పట్టుబడ్డ మద్యం

- 54 మద్యం సీసాలు, ఇసుక లారీ స్వాధీనం

చోడవరం రూరల్: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో చోడవరం పోలీసులకు సోమవారం 54 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఇద్దరిని అరెస్టు చేశామని సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గజపతినగరం జంక్షన్ వద్ద జుత్తాడకు చెందిన శివల ఆదినారాయణ (60) ఉదయం అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సాయంత్రం దామునాపల్లిలో ఎస్ఐ శేఖరం తన సిబ్బందితో చేపట్టిన దాడిలో చవితిన గోవింద(37) నుంచి 39 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిద్దరిపైనా కేసులు నమోదు చేసి జుడీషియల్ కస్టడీకి తరలించినట్టు చెప్పారు. ఆదివారం ముద్దుర్తి జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసి యజమాని కొల్లి గణేష్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. గవరవరంలో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.12,020, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

పడమటమ్మ లోవలో శాంతి హోమం



పడమటమ్మ లోవలో నిర్వహిస్తున్న హోమం

కశింకోట : మండలంలోని విసన్నపేట వద్ద వెలసి ఉన్న పడమటమ్మ లోవలో సోమవారం విశ్వ శాంతి, వ్యక్తిగత శాంతి కోసం హోమం నిర్వహించారు. గురువు పెనిమిటి సాంబమూర్తి సంప్రదాయంగా వేద మంత్రోశ్చరణల నడుమ హోమాన్ని జరిపించారు. ఆదివారం కూడా హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌కు ఉచిత శిక్షణ

అనకాపల్లి : గవరపాలెం పార్కు సెంటర్ శ్రీ సత్యసాయి విద్యాలయంలో ఏప్రిల్ 5వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గౌరీ ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల దుర్గాప్రసాద్ తెలిపారు. పార్కు సెంటర్‌లో ఈమేరకు కరపత్రికలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. 28 ఏళ్ల నుంచి పాలిటెక్నిక్, టీటీసీ, బీఈడీ, గ్రామర్ తరగతులు, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తును పార్కు సెంటర్‌లో ఎస్.వెంకటేశ్వరరావుకు ఏప్రిల్ 2వ తేదీలోపు అందజేయాలయని కోరారు. మరిన్ని వివరాలకు 9247247985 నంబరును సంప్రదించాలన్నారు.

'గుండెపోటుతోనే మృతి'

అనకాపల్లి: మండలంలో జగన్నాథపురం గ్రామానికి చెందిన ముప్వల దేముళ్లు(45) తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందినట్టు రూరల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు వివరాల మేరకు... మృతుడు తమ్ముడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం నివేదికలో గుండెపోటుతో మృతి చెందినట్టు నిర్ధారణ అయిందన్నారు. మృతునికి భార్య పద్మ, కుమారుడు అజయ్‌బాబు, కుమార్తె మాధురి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 6,549 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,220
మొదటి రకం	3,560	4,120
రెండో రకం	3,470	3,820
మూడోరకం	3,280	3,550

అనకాపల్లి సినిమాలు

ఈగల్	రాజా
గామి	సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	సత్యనారాయణస్క్రీన్-2
అనన్య	షిర్డిసాయి
ఓం భీం బుష్	పర్తిసాయి
యమధీర	వెంకటేశ్వర
రికార్డ్ బ్రేక్	శ్రీసత్య
భీమా	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 327 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఎల్లయ్య కాలువపై కష్టాలకు చెల్లు



మిరియాలకాలనీ బ్రిడ్జి

- 83వ వార్డులో ఎల్లయ్య కాలువపై రూ.కోటి 14 లక్షలతో వంతెనల నిర్మాణం
- రెండు బ్రిడ్జిలు పూర్తి, మరో బ్రిడ్జికి త్వరలో శ్రీకారం



వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపం వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి

అనకాపల్లి : స్థానిక 83వ వార్డు పరిధిలో తుమ్మపాల పంచాయతీ గుండాల జంక్షన్ నుంచి (శారదానది నీరు) మిరియాల కాలనీ, లక్ష్మీదేవిపేట, వీఆర్‌పేట, ఉడ్‌పేట, వేల్పులవీధి, రాణిగారి పార్కు సెంటర్, గవరపాలెం, చాకలిపేట, జాతీయ రహదారి మీదుగా ఆవ ఖండంలో రైతుల పంటపొలాలకు సాగునీరు అందించే ఎల్లయ్యకాలువకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సుమారుగా వెయ్యి ఎకరాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందేది. ఎల్లయ్యకాలువకు ఇరువైపులా వేలాది గృహాలు ఉండడంతో బ్రిటిష్‌కాలంలో అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకుని 10 అడుగుల బ్రిడ్జిలను నిర్మించారు. నీటి పారుదల అధికారులు మహానేత రాజశేఖర్‌రెడ్డి పాలనలో కాలువ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని సాగునీటి కాలువతో పాటు సీసీ డ్రైనేజీని పూర్తిస్థాయిలో నిర్మించారు. ఇరిగేషన్‌కాలువకు ఇరువైపులా వీధి డ్రైనేజీ కాలువను నిర్మించి అయా ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కాలువ నిర్మాణ సయయంలో బ్రిడ్జీలను తొలగించకుండా సీసీ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు.

రూ.కోటి 14 లక్షలతో మూడు కొత్త బ్రిడ్జిలు

పట్టణ జనాభా రోజురోజుకు అభివృద్ధి చెందడంతో బ్రిటిష్ కాలం నాటి ఎలయ్యకాలువపై ఏర్పాటు చేసిన బ్రిడ్జిలు శిథిలావ్యవస్థకు చేరుకున్నాయి. అప్పట్లో బ్రిడ్జిలు 10 అడుగులు వెడల్పు మాత్రమే ఉండడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు మాత్రమే ప్రయాణించేవి. ఈ నేపథ్యంలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో రూ.కోటి 14 లక్షల జీవీఎంసీ నిధులయ్యాయి. వేల్పులవీధి కల్యాణమండపం, మిరియాల కాలనీ, అన్నపూర్ణ బ్యాంక్ వద్ద కొత్త బ్రిడ్జిలు నిర్మించేందుకు ఒక్కో బ్రిడ్జికి రూ.38 లక్షలు నిధులు విడుదలయ్యాయి. దీంతో 10 అడుగుల బ్రిడ్జిని 20 అడుగుల వెడల్పు చేయడం జరిగింది. మిరియాల కాలనీ బ్రిడ్జి 20 రోజుల క్రితం ప్రజలకు అంకితం చేశారు. వేల్పులవీధి శ్రీ సీతారామ కల్యాణమండపం బ్రిడ్జి పనులు మూడు రోజుల్లో పూర్తి కానున్నాయి. నిధులు విడుదలైన అన్నపూర్ణ బ్యాంకు రహదారి బ్రిడ్జి నిర్మాణానికి త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

చోడవరం నుంచి అనకాపల్లికి మెయిన్‌రోడ్డు మీదుగా వాహనదారులు రావాలంటే ట్రాఫిక్ సమస్యతో నిత్యం వేలాది మంది ప్రజలు ఇబ్బందులు పడేవారు. బ్రిడ్జిలను అభివృద్ధి చేయడంతో వీధి రహదారుల గుండా ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకలు సాగించడమే కాకుండా ద్విచక్ర వాహదారులతో పాటు, గృహ నిర్మాణానికి ఉపయోగించే పరికరాలను తీసుకువచ్చే లారీ ప్రయాణించే విధంగా కొత్త బ్రిడ్జిలు నిర్మాణం జరిగాయి.

వేల్పులవీధి బ్రిడ్జి నిర్మాణం భేష్



చోడవరం బస్‌స్టాప్ నుంచి వేల్పులవీధి శ్రీ సీతారామ కల్యాణ మండపం మీదుగా మెయిన్‌రోడ్డుకు చేరుకోవాలంటే వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సీతారామ కల్యాణమండపంలో వివిధ కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో పాతబ్రిడ్జి శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి మారింది.

-గొర్లి చిన్న, వేల్పులవీధి

బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జిలకు మోక్షం కలిగింది



ఎలయ్యకాలువలో పంటపొలాలకు సాగునీరు పారుతున్న సమయంలో కొంతమంది మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. దివంగత రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఎల్లయ్యకాలువను, స్థానిక ప్రజలను దృష్టిలో పెట్టుకుని సీసీ డ్రైనేజీ నిర్మించారు. కాలువ పొడవునా సుమారుగా 3వేల నివాసాల ప్రజలు ఆనందంగా ఉన్నారు. పాత బ్రిడ్జిలను తొలగించి, కొత్త బ్రిడ్జిలను వెడల్పు చేయడంతో ప్రభుత్వ అధికారులను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు. మా ప్రాంతంలో ఆర్‌ఏఆర్ఎస్ కార్యాలయం ఉంది. బ్రిడ్జి నిర్మాణ చేయడం వల్ల అడ్డంకిలు తొలగిపోయాయి.

-మళ్ల జోగారావు, మిరియాల కాలనీ

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైతసిద్ధాంతం భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైతసిద్ధాంతం ప్రబోధ సమితి సభ్యులు

తుమ్మపాల: పాల్గుణ మాసంలో పౌర్ణమి నాడు నిర్వహించే హోలీ పండుగలో ఆధ్యాత్మికత ఉందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి, ఇందూ జ్ఞానవేదిక ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. హోలీ పండుగను పురస్కరించుకుని పట్టణంలో త్రైత సిద్ధాంత సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శారదానగర్ త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతలో చాతుర్వర్ణము అని మనుషుల గుణాలను బట్టి, స్వభావాన్ని బట్టి తామసులు, రాజసులు , సాత్వికులు, యోగులు అని నాలుగు రకాలుగా వర్ణించారన్నారు. ఇక్కడ వర్ణము అంటే మనిషి స్వభావం అని అర్థం అని చెప్పారు. ఇందులో శ్రేష్ఠమైనది యోగ,జ్ఞాన మార్గమన్నారు. యోగము అనే వర్ణములోకి అందరూ రావాలి యోగులుగా జ్ఞానులుగా మారాలనే ఉద్దేశంతో దైవరంగును పూసుకోవడమే హోలి రంగులు చల్లు కోవడం అన్నారు. ప్రతి ఒక్కరూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరం తెలుసుకుంటే దైవరంగును జ్ఞానవర్ణంను అందరూ పూసుకుంటే హోలీ జరుపుకొన్నట్లే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అప్పారావు, రమణ, విజయ్, అరుణ్, మంగ,లక్ష్మి, మనీమ, శ్రేయ, పద్మ, కన్యక, మల్లేష్, మోహన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగుల పండగ



కశింకోటలోని గవరపేటలో రంగులు పూసుకొని తిరుగుతున్న యువతీయువకులు



నర్సింగరావుపేటలో హోలీ సంబరాల్లో ప్రజలు

కశింకోట : కశింకోటలో హోలీ ఉత్సవాన్ని యువతి, యువకులు ఆనందోత్సాహాలతో సోమవారం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వీధుల్లో యువతీ యువకులు ఉత్సాహంగా తిరుగుతూ స్నేహితులు, వరస అయ్యే వారిపై రంగులు జల్లారు. కొందరికి పూశారు. దీన్ని స్థానికులు ఆసక్తిగా వీక్షించారు. స్థానిక శారదానది అవతల ఇటుకల బట్టీల్లో పనికి వచ్చిన ఒడిశా కూలీలు కూడా మరింత ఉత్సాహంగా రంగులు పూసుకొని హోలీ పండగ జరుపుకొన్నారు.

ఆనందోత్సాహాలతో హోలీ సంబరాలు

అనకాపల్లి : పట్టణ, మండలంలో పలు ప్రాంతాల్లో సోమవారం హోలీ సంబరాలు అట్టహాసంగా జరిగాయి. కుటుంబ సమేతంగా ఒకరికొకరు రంగులు చల్లుకుని ఉత్సాహంగా గడిపారు. మిఠాయిలు తినిపించుకొని ఎంజాయ్‌చేశారు. హోలీ సంబరాల్లో చిన్నపిల్లలు రంగులు రాసుకుని కేరింతలు పెట్టారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో టమాటా రూ.20, ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంప రూ.30, వంకాయ, క్యాబేజీ, బెండకాయ, దొండకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, కాకరకాయ, చేమదుంప రూ.60, బీరకాయ, చిక్కుడు, క్యాప్సికం రూ.80కి అమ్మకాలు సాగాయి. చింతపండు పిక్కతో కిలో 50, పిక్క తీసినది రూ.వందకు విక్రయాలు సాగాయి.



హాట్ సమ్మర్‌లో కూల్ కూల్‌గా...

యలమంచిలి రూరల్ : రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. వేసవి తాపం నుంచి చల్లబడేందుకు పండ్ల రసాలు, శీతల పానీయాలు, కొబ్బరిబోండాలు, నిమ్మకాయ సోడా స్టాళ్లను జనం ఆశ్రయిస్తుండడంతో చల్లని వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పలు కూడళ్లలో, ప్రధాన రహదారుల పక్కన ఆయా అమ్మకాలు జోరందుకున్నాయి. అలాగే పుచ్చకాయలు, తర్బూజా పండ్ల అమ్మకాలకు డిమాండ్ పెరిగింది. వేసవితాపం నుంచి ఉపశమనం పొందడానికి పలువురు స్విమ్మింగ్ పూల్స్, నదులు, చెరువుల్లో ఈత కొడుతున్నారు. అలాగే పేదోడి ఫ్రిడ్జ్‌గా భావించే మట్టి కుండలు, కూజాల అమ్మకాలు కూడా పెరిగాయి. అయితే కష్టాన్నే నమ్ముకుని ఎండను సైతం లెక్కచేయకుండా వ్యాపారులు వినియోగదారులకు చల్లదనం అందిస్తున్నారు. యలమంచిలి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నలువైపులా ప్రధాన రహదారుల్లో ప్రత్యేక జ్యూస్ స్టాళ్లు, పలు దుకాణాలు వెలిశాయి.





సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

- ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలి
- ఓటర్లను అభ్యర్థించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్
- ఇంటింటా విస్తృత ప్రచారం
- 84 వార్డులో పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక



కోట్నీవీధి కల్యాణ మండపంలో జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించిన మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవలసిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక కోట్నీవీధి కళ్యాణ మండపంలో 84వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సమావేశం వార్డు ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. అంతకుముందు వార్డులో జనసేన పార్టీకి చెందిన 20 మంది యువకులకు వైఎస్సార్‌సీపీ కండువాను భరత్‌కుమార్ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేసేందుకు ఓటర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పలు ప్రాంతాల్లో గడప గడపకు కార్యక్రమం

అభివృద్ధి, సంక్షేమం చూపి మొదటిసారిగా ఓటర్లను ఓటు అడిగే అవకాశం దేశచరిత్రలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని, కరోనా వంటి విపత్తులో ప్రపంచం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినప్పటికీ బడుగు, బలహీన వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలో కొండుపాలెం, సీహెచ్.ఎ న్.అగ్రహారం, పాపయ్యసంతపాలెం గ్రామంలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ద్వారా అవ్వాతాతలకు వృద్ధాప్య పింఛన్లు, అర్హులైన లబ్ధిదారులకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు నేరుగా డీబీటీ పద్ధతి ద్వారా లబ్ధిదారుల ఖాతాలో ఆర్థిక సాయం జమ చేసిన ఘనత మన పేదల ప్రభుత్వానిదేని ఆయన పేర్కొన్నారు. గడప గడపకు తిరుగుతున్న సమయంలో రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మండల పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మరిపల్లి శోభ, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పాపయ్యసంతపాలెం గ్రామంలో ఓటు అభ్యర్థిస్తూ కరపత్రాన్ని అందజేస్తున్న మలసాల భరత్‌కుమార్

స్వేచ్ఛాయుత ఎన్నికలకు అండగా....



నీలిగుంటలో కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్న పోలీసులు

కోటవురట్ల: రానున్న ఎన్నికలలో ఓటర్లు స్వేచ్ఛాపూరిత వాతావరణంలో తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలనే భరోసా కల్పించడానికి మండలంలోని పలు గ్రామాలలో పోలీసులు సోమవారం కవాతు నిర్వహించారు. కొడవటిపూడి, కె.వెంకటాపురం, నీలిగుంట, రామచంద్రపాలెం, బి.కె.పల్లి గ్రామాలలో స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి కవాతు చేశారు. నక్కపల్లి సర్కిల్ సీఐ అప్పన్న మాట్లాడుతూ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఓటర్లు భయపడకుండా శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసులు అండగా ఉంటారన్నారు. ఎక్కడైనా అల్లర్లు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్ఐ రమణయ్య, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పోలమాంబ మండపానికి రూ.25 వేల విరాళం

మాడుగుల: స్థానిక నిర్మలా కాలనీలో వెలసిన పోలమాంబ అమ్మవారు మండప నిర్మాణానికి ఏఎంసీ ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు రూ.25 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని సోమవారం ఆలయ మండపం నిర్మాణ కమిటీ సభ్యులకు ఇచ్చారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంజూరు చేసిన రూ.6 లక్షలతో మండపం నిర్మించారు. ఇంకా నిధులు చాలకపోవడంతో దాతలు మండప నిర్మాణానికి విరాళాలు అందజేయాలని కోరారు.

నేడు వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ అమ్మవారి పండగ



మునగపాక: ఉత్తరాంధ్రలో పేరుగాంచిన వాడ్రాపల్లి పారిపల్లెమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవకమిటీ చైర్మన్ కన్నుంనాయుడు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. పండగలో భాగంగా పలు నేలవేషాలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మ వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కన్నుంనాయుడు కోరారు. పండగ సందర్భంగా ఎస్ఐ పి.ప్రసాదరావు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

దుప్పతూరులో సీతారాముల విగ్రహ ప్రతిష్ట



దుప్పతూరు శ్రీ సీతారాముల ఆలయంలో ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

అచ్యుతాపురం : మండలంలోని దుప్పుతూరు లో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనలో భక్తు లు ప్రసాదాన్ని స్వీకరించారు. ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, కూటమి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, బీజేపీ నియోజక ఇన్‌ఛార్జ్ రాజాన సన్యాసినాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తారెత్తిస్తున్న భానుడు



నిర్మానుష్యంగా కోటవురట్ల మెయిన్‌రోడ్డు

కోటవురట్ల: భానుడి ప్రతాపంతో ఎండలు తారెత్తిస్తున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు బాగా పెరగడంతో జనల ఉక్కిరిబిక్కిరవుతున్నారు. భానుడి ప్రతాపానికి ఇల్లు కదలడానికే భయపడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలైతే చాలు అన్ని రహదారులు ఖాళీ అయిపోతున్నాయి. ప్రధాన కూడళ్ల సైతం జన సంచా రం లేక నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఎండవేడిమికి శీతల పానీయాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. జ్యూస్ సెంటర్లు కళ కళలాడుతున్నాయి. కొబ్బరి బొండాలు, పుచ్చకాయల అమ్మకాలు జోరందుకున్నాయి.

ప్రసవాల సంఖ్య పెరగాలి

నర్సీపట్నం: ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని అదనపు డీఎంహెచ్‌వో బాలాజీ వైద్య సిబ్బందికి సూచించారు. వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ ప్రసవాల గురించి అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ప్రసవాలు చేయాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోవాల్సి వస్తోందని సిబ్బందిని హెచ్చరించారు.